
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 31.0
కనిష్ఠం 22.0

ANDHRAJYOTHY



నల్లగొండ

బుధవారం 13 నవంబరు 2024



యాదగిరీశుడికి

లక్ష పుష్పార్చన

- శాస్త్రోక్తంగా నిత్యపూజలు
- వివిధ విభాగాల ద్వారా రూ.28.75లక్షల ఆదాయం

6



హాలియాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఫలించిన కార్యాచరణ

మిల్‌పాయింట్ల వద్ద సన్న ధాన్యం కొనుగోళ్లు దారినపడ్డాయి. మిల్లుల వద్ద కొనుగోళ్లు సజావుగా జరిగేలా కార్యాచరణ అమల్లోకి తేవడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. మిల్లుల వద్ద పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండడంతో పాటు, ప్రతి మిల్లు వద్ద పోలీసులను సైతం నియమించడంతో పరిస్థితి గాడిలో పడింది.

– (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

- అధికారుల పర్యవేక్షణతో గాడిలోపడిన కొనుగోళ్లు
- రోజంతా సాఫీగా సాగిన కాంటాలు
- సన్నధాన్యానికి రూ.2,320 నుంచి రూ.2,450 వరకు పలికిన ధర
- పరిస్థితిని పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీ

మిర్యాలగూడలోని మిల్లుల మంగళవారం సైతం మూడువేల ట్రాక్టర్ల వరకు ధాన్యం వచ్చినా ఎక్కడా ఎలాంటి అలజడి లేకుండా కాంటాలు సాఫీగా సాగిపోయాయి. మంగళవారం సైతం జిల్లాలోని హాలియా, నిడమనూరు మండలాల్లో ధాన్యం కొనుగోళ్లను కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించి, అధికారులకు సూచనలు చేయగా, ఎస్పీ శరత్‌చంద్రపవార్ మిర్యాలగూడలోని రైస్ మిల్లులలో కొనుగోళ్ల వద్ద పరిస్థితిని పరిశీలించారు. డిసెంబరు మూడోవారం వరకు జిల్లాలోని మిల్లులకు ఇదే రీతిలో ధాన్యం రానుండడంతో మిల్లుల వద్ద చివరివరకు ఇదే విధంగా కొనుగోళ్లు సజావుగా సాగేలా అధికారులు కార్యాచరణ కొనసాగించాలని రైతాంగం కోరుతున్నారు.

తేమ సాకు చూపకుండా కొనుగోలుచేస్తున్న మిల్లర్లు

మిర్యాలగూడలోని రైస్‌మిల్లులకు భారీగా ధాన్యం తరలివస్తుండడంతో కొనుగోళ్లను నియంత్రించడం ద్వారా ధర తగ్గించాలనే కొందరు మిల్లర్ల ప్రయత్నాలను అధికారయంత్రాంగం నిలువరించింది. ఎట్టిపరిస్థితుల్లో ధాన్యానికి కనీసమద్దతు ధర ఇవ్వాల్సిందేనని మిల్లర్ల సమావేశం నిర్వహించి మరీ హెచ్చరించడంతో పాటు, తేమశాతం, తాలు ఎక్కువగా ఉందనే సాకులు చెప్పి ధర తగ్గిస్తే మిల్లులను సీజ్ చేస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టంగా ఆదేశాలివ్వడంతో కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయి. మంగళవారం మిల్‌పాయింట్ల వద్ద సన్న ధాన్యం తేమశాతాన్ని పట్టించుకోకుండా సంప్రదాయ పద్ధతుల ప్రకారం గుమాస్తాలు ధాన్యానికి ధర నిర్ణయించారు. కనీస మద్దతు ధర రూ.2,320 కంటే గరిష్ఠంగా రూ.2,450వరకు ధర పలికింది. అడ్డగోలు సాకులతో కొనుగోళ్లు నిలపకుండా వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్లు మిల్లర్లు కొనుగోలు చేశారు.

అధికారుల పర్యవేక్షణ, పోలీసుల కాపలా

మిల్‌పాయింట్ల వద్ద ధాన్యం ఎక్కువగా వస్తే కొనుగోళ్లు నిలిపివేస్తుండటంతో అలాంటి పరిస్థితి రాకుండా అధికారులు కట్టుదిట్ట చర్యలు తీసుకున్నారు. తహసీల్దార్ నేతృత్వంలో ఆర్ఐలు, సివిల్ సప్లయి ఉద్యోగులు, మార్కెటింగ్, పోలీస్ ఎస్ఐలతో కూడిన ఉద్యోగులు కమిటీలుగా ఏర్పడి మిల్లుల్లో రిజిస్టర్లను తనిఖీలు చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు. మరోవైపు ప్రతీ రైస్‌మిల్లు వద్ద పోలీస్ ఉద్యోగిని కాపలా ఉంచారు. మిల్లు సామర్థ్యం మేరకు ట్రాక్టర్లను ఉదయమే మిల్లు ప్రాంగణంలోకి పంపి కాంటాలు వేయిస్తున్నారు. ఎస్ఐలు, సీఐలు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఇంకోవైపు మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ అమిత్‌నారాయణ్ ప్రతీ మిల్లువద్ద పరిస్థితిని సమీక్షిస్తూ రైతులకు ఇబ్బందిలేకుండా కాంటాలు వేయాలని...

– మిగతా 8వ పేజీలో...





బీజేపీ మూసీ బస

- స్థానిక ఎన్నికలే లక్ష్యంగా క్షేత్రస్థాయికి
- 15న లేదా 16న పరివాహక ప్రాంతాల్లో పర్యటించేందుకు సన్నాహాలు
- ఏర్పాట్లు చేస్తున్న బీజేపీ నేతలు

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా తీసుకున్న మూసీ నది పునరుజ్జీవంపై రాజకీయ రగడ కొనసాగుతోంది. మూసీ పునరుజ్జీవంపై అధికార, ప్రతిపక్షాల మధ్య విమర్శల జోరు కొనసాగుతున్న నేపథ్యంలో బీజేపీ మూసీ పరివాహక ప్రాంతాల్లో రాత్రి బస చేసేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాంతంలో పర్యటించి కాంగ్రెస్ ప్రభుత్వ హామీలపై విమర్శలు గుప్పించేందుకు సన్నద్ధమవుతోంది. ఈ నెల 15 లేదా 16వ తేదీన బీజేపీ మూసీ పరివాహక ప్రాంతాల్లో రాత్రి బసకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది.

– (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

మూసీ పునరుజ్జీవం జరిగి తీరుతుందని, రంగారెడ్డి, హైదరాబాద్, ఉమ్మడి నల్లగొండ ప్రజల ప్రయోజనాల కోసం మూసీ ప్రక్షాళనకు పూనుకున్నామని ఇటీవల వలిగొండ మండలం సంగెం బ్రిడ్జి వద్ద నిర్వహించిన మూసీ పునరుజ్జీవ సంకల్ప పాదయాత్రలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టును అడ్డుకుంటే బుల్డోజర్లు ఎక్కించి ప్రక్షాళిస్తామని సీఎం పరోక్షంగా ప్రతిపక్షాలను హెచ్చరించారు. మూసీ అడ్డుకుంటే కుక్కచావు తప్పదని కేసీఆర్‌పై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఈ పాదయాత్ర ట్రైలర్ మాత్రమేనని, అసలు సినిమా ముందుందని, తన వెంట నడుస్తాన్న హరీష్, కేటీఆర్‌కు సవాల్ విసురుతున్నానని, నిజంగా చిత్తశుద్ధి ఉంటే తేదీ చెప్పండి... తాను రెడీ అని సీఎం చాలెంజ్ చేశారు. సీఎం వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర సంచలనం సృష్టించాయి. మూసీ ప్రక్షాళన చేయని పక్షంలో తన జన్మ దండగని సీఎం పేర్కొనగా, కేవలం కమీషన్ల కోసమే ఈ ప్రాజెక్టును చేపడుతున్నారని ప్రభుత్వంపై బీఆర్ఎస్ విమర్శలు గుప్పిస్తోంది. బీజేపీ సైతం మూసీ పునరుజ్జీవంపై ప్రభుత్వం విమర్శల దాడిచేస్తోంది. మొత్తానికి మూసీ నది ప్రక్షాళన రాజకీయాలకు వేదికగా మారింది. ఈ నేపథ్యంలో మూసీ పరివాహక ప్రాంతాల్లో రాత్రి బస చేయాలని బీజేపీ నిర్ణయించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి ...

– మిగతా 6వ పేజీలో...

న్యూస్ బాక్స్

బాలలను పనిలో పెట్టుకుంటే

చట్టపర చర్యలు

న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి దీప్తి



నార్కట్‌పల్లిలో సదస్సులో మాట్లాడుతున్న దీప్తి

నార్కట్‌పల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాలలను పనికి పంపినా, వారిని పనిలో పెట్టుకున్నా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దీప్తి అన్నారు. బాలకార్మికుల నిర్మూలన, పునరావాసం అనే అంశంపై నార్కట్‌పల్లి ఎమ్మార్సీలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని అన్నారు. డబ్బు కంటే చదువే విలువైనదనే విషయాన్ని తల్లిదండ్రులు గ్రహించాలన్నారు. పిల్లల చదువు బాధ్యత పూర్తిగా తల్లిదండ్రులదేనన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచితంగా న్యాయ సలహా అందిస్తోందని, ఇది సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ఏర్పడిన సంస్థ అని అన్నారు. కార్యక్రమంలో డీఈవో బొల్లారం భిక్షపతి, జిల్లా క్వాలిటీ కో-ఆర్డినేటర్ ఆర్.రామచంద్రయ్య, ఎంఈవో కూకుట్ల నర్సింహ, జడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ హెచ్ఎంలు రాములు, భారతి, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిడమనూరులో కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్

హాలియా, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం అమె హాలియా మార్కెట్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిల్లుల వద్ద ఎమ్మెస్పీ కంటే తక్కువకు కొనుగోలు చేయవద్దని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని అన్నారు. జిల్లాలో ఇప్పటికే 68,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. జిల్లాలో మొత్తం 340 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆమె వెంట డీఎస్‌వో వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖరరెడ్డి, సీఈవో సత్యం, మిల్లర్లు చిట్టిప్రోలు యాదగిరి, నాయకులు కాకునూరి నారాయణ గౌడ్, నాగిరెడ్డి, తహసీల్దారు రఘు, కమిషనర్ రాందుర్గారెడ్డి, ఏవో సరిత పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేపై సందేహాలు వద్దు

నిడమనూరు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేపై ఎలాంటి సందేహాలు, అపోహలు అక్కరలేదని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సర్వేలో భాగంగా ఎన్యూమరేటర్లు ప్రతీ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులు ఇచ్చిన వివరాలను పారదర్శకంగా నమోదు చేస్తారని తెలిపారు. మంగళవారం ఆమె మండలంలోని నిడమనూరు, వల్లభాపురం, తుమ్మడం, రాజన్నగూడెం గ్రామాలను ఆకస్మికంగా సందర్శించి అక్కడ చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను పరిశీలించారు. మండలంలో ఎన్ని కుటుంబాలు ఉన్నాయని, వారి కోసం ఎంతమందిని ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లుగా నియమించారని ఎంపీడీవోను అడిగి తెలుసుకున్నారు. మండలంలో సర్వే నెమ్మదిగా సాగుతున్నందున మరింత వేగవంతం చేయాలన్నారు. తుమ్మడం గ్రామంలో మూడు రోజుల్లో 30 ఇండ్లు కూడా సర్వే చేయకపోవడంతో ఆగ్రహించిన ఆమె సూపర్‌వైజర్ శ్రీనివాస్‌ను మార్చడంతోపాటు రెమ్యూనరేషన్ కూడా ఆపివేయాలని అధికారులను ఆదేశించారు. సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కృష్ణవేణి, తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఎంపీడీవో గుర్రం వెంకటేశం, ఏవో మునికృష్ణయ్య, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, ముంగి శివమారయ్య, ఆర్ఐలు భూక్యా శ్రీను, రాజిరెడ్డి, ఏఈలు వరికుప్పల వెంకన్న, సాయిప్రసాద్, ఏపీవో శ్రీనివాస్, గంగరాజు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు

కలిగిస్తే చర్యలు

ఎస్పీ శరత్‌చంద్రపవార్



శెట్టిపాలెం మిల్లుల వద్ద రైతులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

వేములపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని శెట్టిపాలెం గ్రామశివారులోగల మహాతేజ మిల్లు వద్ద రైతులను ధాన్యం కొనుగోలులో కలుగుతున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని, మిల్లుల వద్ద ఎవరైనా మధ్యవర్తులు మోసాలకు పాల్పడినట్లయితే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. మిల్లు వద్దకు వచ్చిన ఏరోజుకారోజు ధాన్యాన్ని కొనుగోలు చేసేలా మిల్లుల వద్ద ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని, మిల్లు సామర్థ్యం ఆధారంగా ధాన్యాన్ని ఆయా మిల్లులకు వెళ్లేలా చూడాలన్నారు. ప్రతీ మిల్లు కనీస మద్దతు ధరకు తక్కువ కాకుండా కొనుగోలు చేయాలని, లేదంటే సదరు మిల్లులపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్రిమినల్ కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయనవెంట డీఎస్పీ రాజశేఖర్‌రాజు, ఎస్ఐలు వెంకటేశం, కృష్ణయ్య, తహసీల్దార్ పుష్పలత, డీటీ కోటేశ్వరి, ఏఈవో నితిన్, బండారు కుశయ్య తదితరులు ఉన్నారు.

ఇతర రాష్ట్రాల ధాన్యాన్ని అనుమతించం

దామరచర్ల: ప్రస్తుత సీజన్‌లో భాగంగా ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న ధాన్యం రవాణాను సరిహద్దు గుండా రాష్ట్రంలోకి అనుమతించబోమని ఎస్పీ అన్నారు. దామరచర్ల మండలం వాడపల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లో రాష్ట్రంలోకి ఇతర రాష్ట్రాల ధాన్యం అనుమతించబోమన్నారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకొని వారికి పలు సూచనలు చేశారు. ఆయనవెంట డీఎస్పీ రాజశేఖర్‌రాజు, ఎస్ఐ హరికృష్ణ ఉన్నారు.

మిర్యాలగూడ: ఆరోగ్యమే మహాభాగ్యమని ఎస్పీ అన్నారు. ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రుల ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో మిర్యాలగూడ, దేవరకొండ డివిజన్ పోలీసు సిబ్బందికి మంగళవారం మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతలు పరిరక్షించే పోలీసులు ఆరోగ్యంగా ఉండాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు రాజశేఖరరాజు, గిరిబాబు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీతావాణి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



6

మార్మోగుతున్న

శరణుఘోష

దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలి



మునుగోడులో దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ చేస్తున్న నేతలు

బీసీ సంఘం నేతల డిమాండ్

మునుగోడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పేరును రాష్ట్రంలోని ఏదేని జిల్లాకు పెట్టాలని బీసీ సంఘం నేతలు డిమాండ్ చేశారు. మునుగోడులోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో కురుమ యువ చైతన్య సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు కామ్రేడ్ దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, క్యామా మల్లేష్, ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు విశారధన్ మహరాజ్, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, పాల్వాయి స్రవంతి, దూదిమెట్ల బాలరాజు, లింగయ్యయాదవ్, శ్యామ్ కనకాల, నర్రి స్వామి, కురుమ అనుబంధ సంఘాలు, ప్రజాసంఘాల నేతలతో కలిసి మంగళవారం అవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశముఖ్, దొరలు, జమిందార్ల దుర్మార్గాలకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడి అమరుడైన కొమురయ్య మహనీయుడు అని కొనియాడారు. ఆయన త్యాగాలకు స్ఫూర్తిగా ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరముందన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలని రేవంత్‌రెడ్డికి సూచించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఎందరో నేతలు ఆత్మబలిదానాలు చేశారని గుర్తు చేశారు. నాటి స్వాతంత్ర్య ఉద్యమం మొదలు తెలంగాణ ఉద్యమంలోనూ అవే పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముందుగా స్థానిక హైస్కూల్ నుంచి భారీ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కుండే వెంకటేష్, మందుల సత్యం, రావుల ఐలయ్య బండారు శ్రీను, శంకర్, కె.మల్లేష్, పానుగంటి విజయ్‌గౌడ్, బూడిద మల్లిఖార్జున్ యాదవ్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు తెలంగాణ వాదులు పాల్గొన్నారు.

14 వరకు గాలికుంటు

టీకాలు పూర్తిచేయాలి

రాష్ట్ర పరిశీలనాధికారి డాక్టర్ నీరజ

నార్కట్‌పల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆవులు, గేదెలు గాలికుంటు వ్యాధిబారిన పడకుండా వేయిస్తున్న గాలికుంటు నివారణ టీకాలు వేయడాన్ని ఈనెల 14 లోపు పూర్తిచేయాలని గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమ రాష్ట్ర ప్రత్యేక పర్యవేక్షణాధికారి డాక్టర్ నీరజ అన్నారు. మండలంలోని నార్కట్‌పల్లి, చిన్నతుమ్మలగూడెం, నక్కలపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న టీకాల శిబిరాన్ని ఆమె సందర్శించి పశువైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కోల్డ్ చైన్, టెంపరేచర్, ట్యాగింగ్, వ్యాక్సినేషన్ వేసే విధానాన్ని ఆమె స్వయంగా పరిశీలించారు. మండలంలో ఉన్న ఆవులు, గేదెల సంఖ్య ఇప్పటి వరకు వేసిన గాలికుంటు టీకాల సంఖ్యపై వెటర్నరీ డాక్టర్లను ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి రవినాయక్, భార్గవ్ సంతోశ్, వీఎల్‌వో యాదయ్య, దుర్గాభవాని, అనిత, గోపాల మిత్రలు పాల్గొన్నారు.



చిన్నతుమ్మలగూడెంలో గాలికుంటు టీకాల శిబిరాన్ని పరిశీలిస్తున్న నీరజ

సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు

జేడీఏ శ్రవణ్‌కుమార్



రైతులకు అవగాహన కల్పిస్తున్న జేడీఏ శ్రవణ్‌కుమార్

నార్కట్‌పల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సమగ్ర సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. సాగు విధానంలో సేంద్రీయ పద్ధతులు పాటిస్తే ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. మంగళవారం మండలంలోని అక్కినపల్లి రైతు వేదికలో ఎస్‌బీఐ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు శిక్షణ సదస్సులో ఆయన మాట్లాడారు.

వాతావరణంలో మార్పులు, వర్షాలు, తగ్గిపోతున్న భూగర్భనీటి వనరు లు, కూలీల కొరత, వ్యవసాయ ఉత్పాదకాల ధరలు, భారమవుతున్న వ్యవసాయాన్ని త క్కువ ఖర్చుతో చేసే విధానాలపై అవగాహ న కల్పించారు. సమావేశంలో శాస్త్రవేత్త ఎస్‌వీ.సాయిప్రసాద్, స్ఫూర్తి ఫౌండేషన్ మేనేజ ర్ రత్నాకర్, ఏడీఏ జానిమియా, బస్వరాజ్, గౌతమ్, శ్రీకాంత్, సీతారాంరెడ్డి, రాజుయా దవ్, సూర్యప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

అధికారులు, పోలీసులకు గిరిజనులు వ్యతిరేకం కాదు

మిర్యాలగూడ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అధికారులు, పోలీసులకు గిరిజనులు వ్యతిరేకం కాదని కొడంగల్ లగచర్ల ఘటన భూములు కోల్పోతున్న రైతుల ధర్మాగ్రహమేనని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇస్లావత్ రాంచందర్ నాయక్ అన్నారు. మంగళవారం స్థానిక ఎన్ఎస్‌పీ గెస్ట్‌హస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొండంగల్ అసెంబ్లీ డెవలప్‌మెంట్‌అథారిటీ అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ పేరిట రైతులతో శాంతియుతంగా కాకుండా రెచ్చగొట్టే పద్ధతిలో వ్యవహరించడంపై ఆగ్రహావేశాలకు లోనైనట్లు స్థానికులు ద్వారా తెలుస్తోందన్నారు. దాన్ని లంబాడీలు కలెక్టర్‌పై దాడిగా వర్ణిస్తున్నారని అన్నారు. రైతుల వ్యవసాయ భూములను బలవంతంగా లాక్కోవద్దని, అక్కడ ఫార్మా కంపెనీ ఏర్పాటును విరమించుకోవాలని అన్నారు. సమావేశంలో చిట్టిబాబునాయక్, కుర్ర సేవానాయక్, ఆంగోతు హతీరాం, సూర్యానాయక్, శ్రీను నాయక్, సైదానాయక్, పాల్గొన్నారు.

యాదగిరీశుడికి లక్ష పుష్పార్చన



లక్ష పుష్పార్చన పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

భువనగిరి అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం లక్ష పుష్పార్చన పూజలు వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులను వివిధ పుష్పాలు, పట్టువస్త్రాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సహస్రనామ పఠనాలు, వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన పూజలు చేశారు. పాంచరాత్రాగమ రీతిలో గంట పాటు పూజాపర్వాలు కొనసాగాయి.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

స్వామివారి దివ్యక్షేత్రంలో మంగళవారం నిత్యపూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామి అమ్మవార్లను మేల్కొల్పిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకించి తులసీదళాలతో సహస్రనార్చనలు చేశారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలి పూజలతో నిత్య తిరుకల్యాణపర్వాలు ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.28,75,384 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, స్వామివారి దివ్యవిమాన రాజగోపురానికి హైదరాబాద్‌కు చెందిన రాగల శివకాంత్‌కుమార్, శ్రీనివాస్ రూ.5లక్షల చెక్కును అందజేశారు.

మార్మోగుతున్న శరణుఘోష

- పల్లెలు, పట్టణాల్లో మొదలైన పడిపూజలు
- మకర జ్యోతి వరకు కొనసాగనున్న అయ్యప్పపూజలు

హుజూర్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప మాల అంటే ఒక పవిత్రమైన కార్యం. కార్తీక మాసం ప్రారంభం కావడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా అయ్యప్పస్వామి మాలధారణలు మొదలయ్యాయి. అక్టోబరు నుంచి జనవరి 17న మకరవిళక్కు వరకు మాలధారణలో ఉన్న భక్తులు నిత్యం అయ్యప్ప స్వామి పూజల్లో నిమగ్నమవుతుంటారు. ఆయా పూజలతో ఆధ్యాత్మిక చింతన వెల్లివిరుస్తుంది. ముఖ్యంగా హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట, మిర్యాలగూడ, భువనగిరి, యాదగిరిగుట్ట, నల్లగొండ పట్టణ ప్రాంతాల్లోని అయ్యప్పస్వామి దేవాలయాల్లో నిత్యం శరణఘోషలు మార్మోగుతుంటాయి. ప్రత్యేకంగా పూజామండపాలు ఏర్పాటుచేసుకుని అయ్యప్ప నామస్మరణ చేస్తుంటారు. మండల దీక్షలు చేసిన అనంతరం మాలధారులు కేరళ రాష్ట్రంలోని శబరిమలలోని అయ్యప్పస్వామి దేవాలయానికి వెళ్లి ఇరుముడి సమర్పిస్తారు. దురలవాట్లకు దూరంగా ఆధ్యాత్మికతకు దగ్గరగా నిత్యం ఆ స్వామిని స్మరిస్తూ పార్వతీపరమేశ్వర్లు, సుబ్రహ్మణ, గణపతి, లక్ష్మీదేవి, సరస్వతి మాతలను పూజిస్తుంటారు. ఉదయం పానీయం, మధ్యాహ్నం భిక్ష, సాయంత్రం అల్పాహారం చేస్తుంటారు. 41 రోజుల మాల ధరించిన సమయంలో పడిపూజలకు హాజరవుతుంటారు. శబరిమలలోని అయ్యప్పస్వామి దేవాలయం మాదిరి 18 మెట్లు ఏర్పాటు చేసి స్వామికి ప్రత్యేక అర్చనలు, పూజలు చేస్తారు. దీనినే పడిపూజ అంటారు. ఎక్కడ ఉన్న స్వాములైనా పడిపూజకు తప్పక హాజరవుతుంటారు. శబరివాసుడి కీర్తనలతో సుమారు రెండు, మూడు గంటల పాటు జరిగే పూజతో ఆ ప్రాంతం ఆధ్యాత్మికలో మునిగిపోతుంటుంది.



పడిపూజలో 18 మెట్లపూజ





పడిపూసం కోసం ప్రత్యేకంగా అలంకరించే మండపం



భజనల్లో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

ఆశయాలకు వయస్సు అడ్డంకి కాదు

- ఉద్యోగ విరమణ పొందినా సేవలు కొనసాగిస్తున్న పలువురు ఉపాధ్యాయులు
- విశ్రాంతి లేకుండా సేవల్లోనే...

సాధించాలనే తపనకు ఆరు పదుల వయస్సు అడ్డంకి కాదని నిరూపిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు సమాజ సేవలో పాలుపంచుకుంటున్నారు. పదవీ విరమణ ఉద్యోగ బాధ్యతలకే కానీ తమ ఆశయాలకు కాదంటున్నారు. పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాలుపంచుకుం టున్నారు. సమాజ సేవలో ఆనందం ఉంటుందని పేర్కొంటున్నారు.

మోత్కూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏదైనా చేయాలన్న తపనతో సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజల మన్ననలు పొందుతున్నారు యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరుకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు సూరోజు భాస్కరాచారి, రిటైర్డ్ సీడీపీవో యాదమ్మ దంపతులు. భాస్కరాచారి 2013లో, యాదమ్మ 2020లో ఉద్యోగ విరమణ పొందారు. భాస్కరాచారి రిటైర్ కాక ముందునుంచే సామాజిక సేవా కార్యక్రమాలు చేసేవారు. రిటైర్ అయ్యాక పూర్తి సమయాన్ని అందుకే వెచ్చిస్తున్నారు. అందుకు సతీమణి అండగా నిలిచింది. 12ఏళ్లుగా బుజిలాపురం, దాచారం పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు 100 శాతం ఫలితాలు సాధించేందుకు అవసరమైన స్టడీ మెటీరియల్ అందిస్తున్నారు. తన తండ్రి జ్ఞాపకార్థం ప్రతి యేటా గురుపూజోత్సవం నిర్వహించి మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్నారు. ఐదారేళ్లుగా మోత్కూరులో వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం నిర్వహిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి వినాయక చవితి సందర్భంగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీలో భాగస్వామి అవుతున్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తూ ఆయన విద్యార్థులకు చెకుముఖి టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నారు. సామాజిక సేవలకు కలెక్టర్ అనితారామచంద్రన్, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ సీఎం కొణిజేటి రోశయ్య, కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి నుంచి పలు అవార్డులు అందుకున్నారు.



భాస్కరాచారి దంపతులను సన్మానిస్తున్న వేణుగోపాలచారి

సామాజిక సేవ చేయాలి

ఉద్యోగస్తులు రిటైర్ కాగానే వయస్సు అయిపోయిందని భావించొద్దు. ఆరోగ్యం సహకరించినంత కాలం సామాజి సేవలో పాల్గొనాలి. సామాజిక సేవా కార్యక్రమాలు చాలా తృప్తినిస్తాయి. ఇంటికి పరిమితం కాకుండా సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుంది.

● సూరోజు భాస్కరాచారి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు



● ఉత్సాహంతో సమాజ సేవ



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో అన్నదానం

దేవరకొండ : నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణానికి చెందిన అంకం చంద్రమౌళి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడుగా 2012లో పదవీ విరమణ పొందారు. ప్రస్తుతం 70 ఏళ్ల వయస్సులో ఇంట్లో కాలక్షేపం చేయకుండా రిటైర్డ్ ఉద్యోగుల సేవ సంఘం కార్యదర్శిగా పనిచేస్తూ వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూనే ఉన్నారు. పద్మశాలీ అఫిషియల్, ప్రొఫెషనల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా లయన్స్‌క్లబ్ మిత్ర అధ్యక్షుడిగా సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. దేవరకొండలోని నిరుపేదలను, వృద్ధులను గుర్తించి వారికి నిత్యావసరాలు, ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. కరోనా సమయంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పలువురికి భోజనాలు, బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. స్థానిక మార్కండేయస్వామి దేవాలయం ఉపాధ్యక్షుడిగా పనిచేస్తూ దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తూ ముందుకు వెళ్తున్నారు. 2024లో బహుజన సమాజ సాంస్కృతిక అధ్యయన వేదిక ఆధ్వర్యంలో చంద్రమౌళికి జాతీయస్థాయి అవార్డును అందజేశారు.

పేదలకు సేవే లక్ష్యంగా ముందుకు




పేదలకు సేవ చేయాలన్నదే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నా. ప్రధానోపాధ్యాయుడుగా పదవీవిరమణ పొందినా తోటి ఉపాధ్యాయ మిత్రులు, సంఘం సభ్యులతో కలిసి విలాసంగా గడుపుతున్నాం. రిటైర్డ్ ఉద్యోగ సంఘం సమస్యలపై పోరాడుతున్నాం. పేదలకు, నిరుపేదలకు సేవ చేయడంతో పాటు ఆర్థికంగా ఆదుకోవాలన్నదే లక్ష్యంతో ముందుకు వెళుతున్నాం.

అంకం చంద్రమౌళి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి

● పనిచేసిన పాఠశాలకు సేవలు

సంస్థాన్ నారాయణపురం : ప్రతీ ఉద్యోగికి రిటైర్మెంట్ తర్వాత జీవితమంతా కుటుంబ సభ్యులతో సరదాగా గడపాలని కోరుకుంటారు. కానీ కొంతమంది మాత్రం విశ్రాంతి అనేది వయసుకే కానీ మనసుకు కాదని ఇతరత్రా పనుల్లో పాలుపంచుకుంటారు. అలాంటి కోవకు చెందిన వారిలో యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలకేంద్రానికి చెందిన ఒకరు బాలగోని యాదయ్య. యాదయ్య ప్రభుత్వ ఉపాధ్యాయుడి, ప్రధానోపాధ్యాయుడిగా 28 ఏళ్లుగా వివిధ ప్రభుత్వ పాఠశాలలో పనిచేశారు. ఈ ఏడాది మేలో ఉద్యోగ విరమణ చేశారు. రిటైర్డ్ అయినప్పటికీ ఖాళీగా ఇంట్లో ఉండడం ఇష్టం లేక సమాజానికి తమవంతు ఏదైనా చేయాలనుకున్నాడు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడి కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్న విషయం తెలుసుకున్నాడు. గతంలో తాను అదే పాఠశాలలో పనిచేయడం, ఆ ప్రేమతో రోజూ పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నాడు. ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు స్వచ్ఛందంగా పాఠాలు బోధిస్తున్నారు. రిటైర్డ్ అయ్యాక విశ్రాంతి తీసుకోకుండా పనిచేస్తూ విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు యాదయ్యను పలువురు అభినందిస్తున్నారు.

విద్యపై ఉన్న మమకారంతో



ఖాళీగా ఉండడం ఇష్టం లేక విద్యార్థులకు స్వచ్ఛందంగా పాఠాలు బోధిస్తున్నా. నేను కూడా అదే పాఠశాలలో చదువుకున్నా. ఉద్యోగం వచ్చాక అక్కడే విద్యాబోధన చేశా. అందువల్లే ఆ పాఠశాలపై మమకారం ఎక్కువ. రిటైర్మెంట్ తర్వాత ఖాళీగా ఉంటే బదులు సమాజానికి ఉపయోగపడేలా ఏదో ఒకటి చేయాలి. తనకు పాఠశాలలో విద్యార్థులకు చదువు చెప్పే అవకాశం రావడం సంతోషంగా ఉంది.

● బాలగోని యాదయ్య, రిటైర్డ్ టీచర్

బీజేపీ మూసీ బస

(5పేజీ తరువాయి)

జి.కిషన్‌రెడ్డితోపాటు సీనియర్ నేతలు, జిల్లా నేతలతో కలిసి మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించి, బస చేసేందుకు పార్టీ సన్నాహాలు చేస్తోంది.

సీఎం సవాల్ నేపథ్యంలో

ప్రధానమంత్రి నరేంద్రమోదీ గుజరాత్‌లో గంగా, సబర్మతి నదులను రూ.40వేల కోట్లతో సుందరీకరణ చేస్తుంటే బీజేపీ నేతలు మెచ్చుకున్నారని, తాను తెలంగాణ సీఎం మూసీ పునరుజ్జీవం చేయొద్దా అని వలిగొండ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీని అని ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో ఉంటే స్థానిక పరిస్థితులు అవగతమవుతాయని సీఎం వ్యాఖ్యానించారు. ఆయన సవాల్‌ను బీజేపీ స్వీకరిస్తూ, మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకుని, రాత్రి వేళ బస చేయాలని నిర్ణయించింది. మూసీ పరివాహక ప్రాంతాలైన భువనగిరి, బీబీనగర్, భూదాన్‌పోచంపల్లి, వలిగొండ, రామన్నపేట మండలాల పరిధిలో ఎవరెవరు ఏ ప్రాంతాల్లో పర్యటించాలనే తేదీలను త్వరలో ఖరారు చేసే అవకాశం ఉంది. రాత్రి వేళల్లో సభలు సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. ఈ సమావేశాల వేదికగా కేంద్ర ప్రభుత్వం మూసీ ప్రక్షాళనకు తీసుకున్న చర్యలను ప్రజలకు వివరించే ప్రయత్నాన్ని బీజేపీ నేతలు చేయనున్నారు. ఒక నాడు తాగు నీటిని అందించిన మూసీ ప్రస్తుతం మురికి కూపంగా మారడానికి గత ప్రభుత్వాలే కారణమని ప్రజలకు వివరిస్తూ ఈ ప్రాంత కులవృత్తిదారులతో సంభాషించనున్నారు.

స్థానిక ఎన్నికలే లక్ష్యంగా పాదయాత్రలు

బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల నుంచి వచ్చిన మద్దతతో స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవాలని ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ మేరకు రాష్ట్ర కమిటీ డిసెంబరు 1వ తేదీ నుంచి క్షేత్రస్థాయికి వెళ్లాలని నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పాదయాత్రలు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. స్థానికంగా పార్టీని బలోపేతం చేయడంతో పాటు రానున్న ఎన్నికలే లక్ష్యంగా ప్రచారాన్ని చేపట్టనుంది. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను 100రోజుల్లో అమలు చేస్తామని ఇచ్చిన హామీలపై ఈ పాదయాత్ర ద్వారా ఎండగట్టనుంది. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలను ప్రజలకు తెలియజేసేందుకు యాత్ర చేపట్టనుంది. జిల్లాలో భువనగిరి, ఆలేరు నియోజకవర్గాలు పూర్తిస్థాయిలో ఉండగా, మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్ నియోజకవర్గాలు పాక్షికంగా ఉన్నాయి. ప్రతీ నియోజకవర్గానికి రాష్ట్ర స్థాయి నేతను ఇన్‌చార్జీగా నియమించి, స్థానిక నేతలతో కలిసి ఈ యాత్రలు చేపట్టనున్నారు. ఈ మేరకు జిల్లాల వారీగా త్వరలో సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గాల వారీగా రూట్ మ్యాప్‌లను ఖరారు చేయనున్నారు. అందుకోసం స్థానిక నేతల నుంచి యాత్రకు సంబంధించిన పూర్తి వివరాలు తీసుకోనున్నారు.

తైక్వాండోలో బంగారు పతకం



బంగారు పతకంతో జునేరాఖుల్సూమ్ (మధ్యలో)

మిర్యాలగూడటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఎస్ఆర్ డీజీ పాఠశాల 6వ తరగతి విద్యార్థిని జునేరా ఖుల్సూమ్ తైక్వాండో పోటీల్లో బంగారు పతకం సాధించారు. మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన అండర్-14 నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచినట్లు కోచ్ యూనిస్ మాలిక్ తెలిపారు. జునేరాఖుల్సూమ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో సాధిక్‌అలీ, ఫర్హానాబేగం తదితరులు పాల్గొన్నారు.

కామినేని దంత వైద్య కళాశాలకు
ప్రత్యేక గుర్తింపు అవార్డు

- ఢిల్లీలో ప్రధానం చేసిన కేంద్ర ఆరోగ్యశాఖాధికారులు



కేంద్ర ఆరోగ్యశాఖ అధికారుల నుంచి అవార్డు అందుకుంటున్న మహేష్

నార్కట్‌పల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలకేంద్రంలోని కామినేని దంత వైద్య, విద్యా కళాశాలకు కేంద్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ నుంచి అరుదైన గుర్తింపు లభించింది. జాతీయ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో కామినేని కళాశాల యాజమాన్యం గ్రామీణ ప్రాంతాల్లో వైద్యశిబిరాలు, ర్యాలీలు, దంత ఆరోగ్యంపై అవగాహన సదస్సులను నిర్వహించినందుకు 2024 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక గుర్తింపు అవార్డుకు ఎంపిక చేసింది. మంగళవారం న్యూఢిల్లీలోని ఎయిమ్స్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్ర అడిషనల్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎల్.స్వస్తి చరణ్, డైరెక్టర్ ఈఎంఆర్, హెల్త్ సర్వీసుల విభాగం డీజీ డాక్టర్ అతుల్ గోయల్ నుంచి కళాశాల ప్రిన్సిపాల్ పీ మహేష్ అవార్డును అందుకున్నారు.

విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో ముందుకుసాగాలి





డిండిలో బాలికల విభాగంలో కబడ్డీ పోటీలు, రాజాపేటలో బాలుర విభాగంలో పోటీ

డిండి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో ముందుకెళ్లాలని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల జోనల్ అధికారి విద్యారాణి అన్నారు. డిండి మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో ఈ నెల 11 నుంచి నిర్వహిస్తున్న 10వ జోనల్ స్థాయి క్రీడాపోటీలను మంగళవారం ఆమె సందర్శించి, మాట్లాడారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని కొద్దిసేపు ఆడి వారిలో ఉత్సాహం నింపారు. పోటీల్లో గెలుపోటములు సహజమన్నారు. విద్యార్థులు ఏర్పాటుచేసిన ఫొటోగ్యాలరీని సందర్శించారు.

క్యారమ్స్ విభాగంలో

అండర్-14 ఇమాంపేట గురుకుల పాఠశాల ప్రథమస్థానం, కట్టంగూరు ద్వితీయ స్థానం

అండర్-17 విభాగంలో జీవీగూడ ప్రథమ స్థానం, డిండి ద్వితీయస్థానం

అండర్-19 విభాగంలో డిండి ప్రథమ స్థానం, ఇమాంపేట ద్వితీయస్థానం

100 మీటర్ల పరుగుపందెంలో

అండర్-14 విభాగంలో వై.దీపిక జీవిగూడ ప్రథమ, మేఘన మఠంపల్లి ద్వితీయస్థానం.

చెస్ పోటీల్లో

అండర్-14 విభాగంలో జీవిగూడ మొదటి స్థానం, నకిరేకల్ ద్వితీయస్థానం,

అండర్-17 విభాగంలో ఇమాంపేట మొదటి స్థానం, మఠంపల్లి ద్వితీయస్థానం,

అండర్-19 విభాగంలో జీవిగూడ మొదటి స్థానం, డిండి ద్వితీయస్థానం

షాట్‌పుట్ విభాగంలో

అండర్-14 విభాగంలో కట్టంగూరు మొదటి స్థానం, డిండి ద్వితీయస్థానం.

రాజాపేటలో 10వ జోనల్ స్థాయి

రాజాపేట: యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల్లో 10వ జోనల్ స్థాయి పోటీలు మంగళవారం రెండవరోజు కొనసాగాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాడ్మింటన్, చెస్ అథ్లెటిక్స్‌లో క్రీడాకారులు ప్రతిభను చాటారు. క్రీడల నిర్వహణను జోనల్ అధికారి విద్యారాణి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుధాకర్, డీసీవో జగదీశ్వర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ రాజు, వివిధ పాఠశాల ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ విజేతలు వీరే

10వ జోనల్ స్థాయి అథ్లెటిక్స్ పోటీలో విజేతలను మంగళవారం ప్రిన్సిపాల్ సుధాకర్, జోనల్ అధికారి విద్యారాణి, డీసీవో జగదీశ్వర్ రెడ్డి ప్రకటించారు.

200మీటర్లలో

అండర్-14 విభాగంలో మహేష్ ప్రథమ, (స్టేషన్‌ఘణ్‌పూర్), ఎం చైతన్య ద్వితీయ(చండూరు)

లంగ్‌జంప్‌లో

ఎం మహేష్ ప్రథమ(స్టేషన్‌ఘణ్‌పూర్), కే అరవింద్ ద్వితీయ(స్టేషన్‌ఘణ్‌పూర్)

అండర్-17 విభాగంలో ఆర్ ప్రణయ్ ప్రథమ(స్టేషన్‌ఘణ్‌పూర్), ప్రవీణ్ ద్వితీయ(హుజూర్‌నగర్)

500 మీటర్ల దూరంలో

అండర్-17 విభాగంలో ఎస్ శివ ప్రథమ(తిప్పర్తి), అభినేవ్‌కుమార్ ద్వితీయ(భువనగిరి)

అండర్-19 విభాగంలో గోపిచంద్ ప్రథమ (మిర్యాలగూడ), సీహెచ్ ప్రవీణ్ ద్వితీయ(స్టేషన్ ఘణ్‌పూర్)

డిస్కస్‌త్రో విభాగంలో

అండర్-19 ఎ శంకర్ ప్రథమ(స్టేషన్‌ఘణ్‌పూర్), ప్రవీణ్ ద్వితీయ (జనగామ),

లాంగ్‌జంప్‌లో

కార్తీక్‌రాజు ప్రథమ(మునగాల), అజయ్‌కుమార్ ద్వితీయ (భువనగిరి) విజేతలుగా నిలిచారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థి ఎంపిక

కనగల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి చెస్‌పోటీలకు నల్లగొండ జిల్లా కనగల్ మోడల్ స్కూల్ ఇంటర్(బైపీసీ) మొదటి సంవత్సరం విద్యార్థిని అనూష ఎంపికైంది. ఈ నెల 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా తరపున అనూష పాల్గొననుందని ప్రిన్సిపాల్ థామస్, పీడీ విజయ్ తెలిపారు. అనూషను ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు..

తిరుమలగిరి(సాగర్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన పిట్టల సంపత్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. మహబూబ్‌నగర్ జిల్లా రాచాలలో నిర్వహించిన 68వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్-19 కబడ్డీ విభాగంలో ప్రతిభ కనబరిచి డిసెంబరులో మహారాష్ట్రలో నిర్వహించే జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ప్రస్తుతం సంపత్ చింతపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సంపత్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై తల్లిదండ్రులు, గ్రామస్థులు, క్రీడాకారులు అభినందించారు.

వాలీబాల్ పోటీల్లో ప్రతిభ

మఠంపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం విద్యార్థిని ఎస్ మల్లేశ్వరి ప్రతిభ కనబరిచింది. అండర్-17విభాగంలో వర్ధాపురం ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని మల్లేశ్వరి ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టు తరుపున పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు వీరస్వామి తెలిపారు. మల్లేశ్వరిని ఉపాధ్యాయులు అభినందించారు.

నెట్‌బాల్ విభాగంలో సాగర్ విద్యార్థులు

నాగార్జునసాగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీ సెయింట్ జోసప్ పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. ఆదిలాబాద్ జిల్లా నిర్మల్‌లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయురాలు లలిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికల జట్టు ప్రథమ స్థానం సాధించగా, బాలుర జట్టు ద్వితీయస్థానం సాధించిందన్నారు.ప్రథమ స్థానం సాధించిన బాలికల్లో బీ.కీర్తన, ఎండీ సుభానూర్, జే సుప్రవిరాజ్, ఎస్‌కే రిజ్వానా, బీ కరుణ, పీ మహేశ్వరీ, ఆర్ సింధు, బీ పూజ, ఎస్‌కే మోహక్, జే దీక్షితలు ఉన్నారు. బాలుర జట్టులో వెంకటసాయి, పృథ్వీరాజ్, సాయి, నిఖిలేస్, మోహన్, స్వరూప్, నజీబ్, పవన్ కుమార్‌లు ఉన్నారు. విద్యార్థులను జిల్లా నెట్‌బాల్ అసోషియేషన్ కార్యదర్శి కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న విద్యార్థులు

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.132	210	240
సూర్యాపేట	రూ.125	190	220
నల్లగొండ	రూ.150	220	250

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	587.10
టీఎంసీలు	305.5050
ఎడమకాల్వకు నీటి విడుదల	3,374
కుడికాల్వకు	10,200
విద్యుత్ కేంద్రం ద్వారా	0
ఎస్ఎల్‌బీసీ ద్వారా	24,00 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	400 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	28,852 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	16,374 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	42.27 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	0
అవుట్‌ఫ్లో	2వేల క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	643.89 అడుగులు
టీఎంసీలు	4.17
ఎన్ని గేట్ల ద్వారా	1 గేటు
ఇన్‌ఫ్లో	429.27 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	369.47 క్యూసెక్కులు

రోడ్డుపై ధాన్యం.. ప్రయాణాలకు ఆటంకం

జాతీయ రహదారి సర్వీస్ రోడ్లపై ధాన్యం ఆరబోత ▸ ప్రమాదాల బారిన పడుతున్న వాహనాదారులు



భువనగిరి బైపాస్ సర్వీస్ రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

భువనగిరి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి సర్వీస్ రోడ్లపై ధాన్యం ఆరబెడుతుండడంతో వాహనాదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుపై ధాన్యం ఉండడంతో రోడ్డు ఇరుకుగా మారి వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రమాదాలు జరిగి వాహనదారులు క్షతగాత్రులవుతున్నారు. సర్వీసు రోడ్డుపై పదేళ్లుగా ధాన్యం ఆరబోస్తున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని కొండమడుగు వద్ద ప్రారంభమైన సర్వీసు రోడ్డు భువనగిరి మండలం, భువనగిరి అర్బన్, యాదగిరిగుట్ట మండలం వంగపల్లి వరకు సుమారు 20 కిలోమీటర్ల ఉంటుంది. ఈ రోడ్డుపై సుమారు పది సంవత్సరాలుగా ధాన్యం ఆరబెడుతున్నారు. రోడ్డు ఇరుకుగా ఉండడంతో యాదగిరిగుట్ట, భువనగిరి, బీబీనగర్ మండలాల చెందిన 18 మంది ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల్లో గాయపడ్డారు. హైదరాబాద్-వరంగల్ 163వ జాతీయ రహదారి భువనగిరి శివారులోని రాయిగిరి సర్వీస్ రోడ్డు, నల్లగొండ ఫ్లైఓవర్ బ్రిడ్జి సర్వీస్ రోడ్డు వద్ద రైతులు ధాన్యం ఆరబోసుకుంటున్నారు. తమకు అనుకూలంగా కల్లాలు లేకపోవడంతోనే గత్యంతరం లేక జాతీయ రహదారికి సంబంధించిన సర్వీస్ రోడ్లను వినియోగించుకుని ధాన్యం ఆరబోస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. భువనగిరి మండలానికి చెందిన ద్విచక్ర వాహనాదారుడు వెంకటేశ్ గమనించకుండా ధాన్యం రాశులపై ఉంచి వెళ్లి కిందపడి గాయపడ్డాడు. అదే విధంగా నిత్యం ఈ రహదారుల గుండా మంత్రులు, జిల్లా స్థాయి అధికారులు రాకపోకలు కొనసాగిస్తుంటారు. కాగా రాత్రి వేళల్లో ఆ ధాన్యం రాశులపై నల్లటి ప్లాస్టిక్ కవర్లు కప్పిఉంచడం, కుప్పలా పక్కన పెద్ద పెద్ద రాళ్లు పెట్టడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు రైతులతో మాట్లాడి వాహనాదారులకు ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

రైతులు ధాన్యాన్ని సర్వీస్ రోడ్లపై ఆరబోస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. పగిడిపల్లి, అనంతారం, భువనగిరి బాగాయత్, రాయిగిరి పరిధిలోని జాతీయ రహదారి సర్వీస్ రోడ్లపై ధాన్యాన్ని ఆరబోయవద్దని చెప్పాం. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానిక పోలీసు లు మా దృష్టికి తెచ్చారు. కౌన్సిలింగ్ ఇచ్చి సర్వీస్ రోడ్లపై ధాన్యం ఆరబోయకుండా చర్యలు తీసుకుంటాం.

- సైదులు ఆర్‌అండ్‌బీ ఏఈ, భువనగిరి.

రహదారిపై ధాన్యం ఆరబోయడంతో..

సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం తుమ్మలపెన్‌పహాడ్ గ్రామానికి చెందిన పిడమర్తి నాగరాజు(25) దీపావళి పండుగ కోసం ఈ నెల 1వ తేదీన చివ్వెంల మండలం చందుపట్ల గ్రామానికి వెళ్లాడు. గురువారం రాత్రి బైక్‌పై తిరిగి వస్తుండగా వట్టిఖమ్మంపహాడ్ సమీపంలో రహదారిపై ఆరబోసిన ధాన్యం కుప్పల కారణంగా అదుపుతప్పి పడిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు.

రహదారిపై ధాన్యం ఆరబెట్టడం నివారించాలి



రైతులకు అవగాహన కల్పించకపోవడంతో ధాన్యాన్ని రోడ్లపై ఆరబోస్తున్నారు. దీంతో రాత్రి వేళల్లో వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా రైతుల వ్యవసాయ బావుల వద్ద క్లస్టర్ల వారీగా సరిపడా కల్లాలను ఏర్పాటు చేయాలి. రహదారిపై ధాన్యం ఆరబోయకుండా చర్యలు తీసుకోవాలి.

- కంచిమల్లయ్య, స్థానికుడు

వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

దేవరకొండ, నవంబరు 12(ఆంధ్రజోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలోని తాటికోలు గ్రామ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా అవుతుందన్న సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న డ్రైవర్ సోమ్లానాయక్‌పై కేసు నమోదు చేసి, ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కుక్కల దాడిలో 20 గొర్రెలు మృత్యువాత

మేళ్లచెరువు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో 20 మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలంలోని పులిచింతల ప్రాజెక్టు కాలనీలో మంగళవారం జరిగింది. బాధితుడు ఆనంగి వెంకయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గొర్రెలను మేత కోసం సోమవారం ఉదయం తీసుకెళ్లాడు. సాయంత్రం ప్రాజెక్టు సమీపంలోని నెమలిపురి కాలనీలో ఉన్న కొట్టంలో గొర్రెలను వదిలాడు.

కుక్కలు రాత్రి గొర్రెలపై దాడి చేశాయని, మంగళవారం ఉదయం వెళ్లి చూడగా 20 గొర్రెలు మృతిచెందినట్లు బాధితుడు తెలిపాడు. గొర్రెల విలువ సుమారు రూ.1.50లక్షలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని వెంకయ్య వేడుకున్నాడు.

చికిత్సపొందుతూ మహిళ మృతి



రోజా (ఫైల్)

చింతపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని ధైర్యపురితండాలో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ధైర్యపురితండాకు చెందిన వాంకుడోత్ రోజా(25), హరి దంపతులు గ్రామంలో కిరాణ షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అదే తండాకు చెందిన వాంకుడోత్ వెంకట్, శారద దంపతుల కుమారుడు కల్యాణ్ కిరాణ దుకాణానికి వచ్చి రోజాతో మాటలు కలిపి చనువుగా ఉండేవాడు. సెల్‌ఫోన్ ఇప్పించి ఆమెతో మాట్లాడేవాడు. అక్టోబరు 26వ తేదీన రాత్రి కల్యాణ్ రోజాకు ఫోన్ చేసి పెళ్లి చేసుకుంటానని చెప్పి వరంగల్‌కు తీసుకెళ్లాడు. రెండు రోజుల నుంచి రోజా కన్పించకపోవడంతో రోజా కుటుంబసభ్యులు కల్యాణ్ కుటుంబ సభ్యులను నిలదీశారు. తల్లిదండ్రులు కల్యాణ్‌కు ఫోన్ చేసి విషయం చెప్పారు. అక్టోబరు 28వ తేదీన కల్యాణ్ రోజాతో కలిసి తండాకు వచ్చాడు. హరి కుటుంబసభ్యులతో కలిసి రోజాను కాపురానికి తీసుకెళ్లాడు. దీంతో ఇరువర్గాల మధ్య గొడవ చిలికి చిలికి తారస్థాయి చేరింది. మనస్తాపం చెందిన రోజా అక్టోబరు 30వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. హరి తల్లిదండ్రులు వ్యవసాయ పనులు ముగించుకొని వచ్చేసరికి రోజా ఫ్యాన్‌కు వేలాడుతూ కన్పించింది. చికిత్సనిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందింది. రోజా భర్త హరి ఫిర్యాదు మేరకు కల్యాణ్‌తో పాటు తల్లిదండ్రులు వాంకుడోత్ వెంకట్, శారద బంధువులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

11 రోజులు మృత్యువుతో పోరాడి..

భువనగిరి రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని వీరవెల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన సిరికొండ అయిలయ్య(38) ఈ నెల 2న తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగి అపస్మాకర స్థితిలో వెళ్లిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు భువనగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్య చికిత్సకోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. 11రోజులుగా మృత్యువుతో పోరాడి మంగళవారం మృతిచెందాడు. అయిలయ్య సోదరి చర్లపల్లి సత్యలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో వారణాసి సంతోష్‌కుమార్ తెలిపారు. అయిలయ్య బోర్‌వెల్ వాహనంపై డ్రైవర్‌గా పని చేసేవాడు. అతనికి భార్య ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

దొంగతనం కేసులో ఏడాది జైలు

పెద్దఅడిశర్లపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): దొంగతనం చేసిన వ్యక్తికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ దేవరకొండ జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి పి. రవీందర్ మంగళవారం తీర్పు ఇచ్చారు. గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ రాష్ట్రం గుంటూరు జిల్లాలోని నరసరావుపేటకు చెందిన పాత నేరస్థుడు కత్తి రవికుమార్ నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని రంగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన గజ్జెల సుధాకర్‌రెడ్డి ఇంట్లో జనవరి నెలలో తులంన్నర బంగారం దొంగతనం చేశాడు. పెద్దవూర మండలం లింగంపల్లిలో బైక్ దొంగతనం చేశాడు. అతనిపై గుడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నిందితుడిని చాకచక్యంగా పోలీసులు పట్టుకొని దేవరకొండ కోర్టులో హాజరపరిచారు. నిందితుడిని పట్టుకున్న గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు, కోర్టు కానిస్టేబుల్ శేఖర్‌ను కొండమల్లేపల్లి సీఐ ధనంజయ్య అభినందించారు.

రైలుపట్టాలపై మృతదేహం లభ్యం

భువనగిరి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి - పగిడిపల్లి రైల్వేస్టేషన్ల మధ్య మంగళవారం గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ జే కృష్ణారావు తెలిపారు. సుమారు 30 ఏళ్ల వయస్సు ఉండి, శరీరంపై ఎర్రని డ్రాయర్ ఉందని తెలిపారు. రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడా, లేక నడుస్తున్న రైలు నుంచి జారి పడి మృతి చెందాడా తేలాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రిలో భద్రపరిచామని, ఆనవాళ్లు తెలిసిన వారు సెల్ నెంబర్లు 9848222169, 8712568454కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

పశువులు తరలిస్తున్న వాహనాలు పట్టివేత

మునగాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కబేళాకు పశువులను తరలిస్తున్న వాహనాలను మంగళవారం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సూర్యాపేట జిల్లా మునగాల ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రం శివారులో వాహనాలను తనిఖీ చేస్తుండగా, కోదాడ నుంచి హైదరాబాద్‌కు పశువులను రెండు వాహనాల్లో తరలిస్తున్నారు. ఆయా వాహనాల్లో 17 పశువులను ఆంధ్రప్రదేశ్ జగ్గయ్యపేట నుంచి కబేళాకు తీసుకెళ్తున్నట్లు డ్రైవర్ గొడ్ల బాబ్జీ తెలిపాడని, మరో డ్రైవర్ పరారీలో ఉన్నాడని, ఇరువురిపై కేసు నమోదు చేసి, గోవులను హైదరాబాద్ జీయాగూడ గోశాలకు తరలిస్తున్నట్లు ఎస్‌ఐ తలిపారు.

డీసీఎంలోని గడ్డి దగ్ధం

వలిగొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి డీసీఎంలోని గడ్డి దగ్ధమైంది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని ఎదుళ్లగూడెం గ్రామంలో మంగళవారం జరిగింది. రామన్నపేటకు చెందిన ఎర్ర నర్సింహ ప్రొద్దటూరు గ్రామంలోని గడ్డిని డీసీఎం వాహనంలో లోడ్ చేసుకొని స్వగ్రామానికి వెళ్తుండగా విద్యుత్‌వైర్లు తగిలి డీసీఎంలోని గడ్డి దగ్ధమై మంటలు చేలరేగాయి. డ్రైవర్ ఫైర్‌సిబ్బంది సమాచారం ఇవ్వడంతో మంటలు ఆర్పేశారు. ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు.

హోటల్ క్వార్టర్స్‌లో మహిళ హత్య



ఝాన్సీ మృతదేహం

కేతేపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): హోటల్ సిబ్బంది నివాసించే క్వార్టర్స్‌లో మహిళ హత్యకు గురైంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని ఇనుపాముల శివారులో గల 'మా పల్లెరుచులు' హోటల్‌లో మంగళవారం జరిగింది. పోలీసులు, హోటల్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రికొత్తగూడెం జిల్లా అశ్వాపురానికి చెందిన గంగాధర ఝాన్సీ(22), నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని తెప్పలమడుగు గ్రామానికి చెందిన పెద్దమల్లు కోటేశ్వరరావు అలియాస్ బన్నీ 20రోజుల క్రితం హైవే వెంట గల మా పల్లెరుచులు హోటల్‌లో పనికి కుదిరారు. వీరు హోటల్‌లోనే తిని హోటల్‌కు వెనుక వైపు గల సిబ్బంది క్వార్టర్లలో నివసించేవారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి హోటల్‌లో విధులు ముగించుకుని క్వార్టర్‌కు వెళ్లిన ఝాన్సీ, బన్నీ మంగళవారం ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో నిద్రలేచి టిఫిన్ చేసి వెళ్లారు. మధ్యాహ్నం హోటల్‌లో డ్యూటీకి రావాల్సిన ఇద్దరూ రాకపోవడంతో హోటల్ యాజమాన్యం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో వారి గదికి వెళ్లి చూస్తే ఝాన్సీ విగతజీవిగా మంచంలో పడి ఉంది. బన్నీ గదిలో లేదు. దీంతో హోటల్ నిర్వహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ శివతేజ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీం సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. ఈ సంఘటనకు బాధ్యుడిగా భావిస్తున్న బన్నీ కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. ఝాన్సీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ఎస్‌ఐ శివతేజ తెలిపారు. బన్నీ సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా నల్లగొండలో పోలీసులకు పట్టుబడినట్లు సమాచారం.

ట్రాక్టర్ ట్రాలీలో ధాన్యం అన్‌లోడ్ చేస్తుండగా..

- **ట్రాలీకి విద్యుత్ తీగలు తగిలి రైతు మృతి**



ట్రాలీకి తగిలిన విద్యుత్ తీగలు



సైదులు (ఫైల్)

మునగాల నవంబరు 12(ఆంధ్రోజ్యోతి): ట్రాక్టర్ ట్రాలీలో ఉన్న ధాన్యం ఐకేపీ కేంద్రంలో అన్‌లోడ్ చేస్తుండగా ట్రాలీ విద్యుత్ తీగలకు తగిలి రైతు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని తాడ్వా యి గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తాడ్వాయి గ్రామానికి చెందిన చిర్రా సైదులు(58) పండించిన ధాన్యాన్ని ట్రాక్టర్‌లో లోడ్ చేసుకొని తాడ్వాయి నుంచి రెండు కిలో మీటర్ల దూరంలో కలకోవ రోడ్డు సమీపంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధ్యాన్యం కొనుగోలు కేంద్రానికి వెళ్లాడు. ట్రాక్టర్‌లో ఉన్న ధాన్యం అన్‌లోడ్ చేసేందుకు ట్రాలీ హైడ్రాలిక్‌ను ఎత్తి కిందికి దిగాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ నూటల్‌గా ఉండి ముందుకు వెళ్లడంతో పైన ఉన్న 11కేవీ విద్యుత్ తీగల్ హైడ్రాలిక్‌తో ఉన్న ఇనుప పైపులకు తాకాయి. వెంటనే ట్రాక్టర్‌ను ఆపేందుకు వెళ్లడంతో సైదులు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సైదులు భార్య సైదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి..



శాలిగౌరారం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పొలంలో గేదెలు మేపుతుండగా ప్రమాదవశాత్తు తెగిపోయిన విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతిచెం దాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని భైరవునిబండలో మంగళవారం జరి గింది. ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. భైరవునిబండ గ్రామానికి చెందిన మణికొండ యాదయ్య(58) కూలి పనిచేస్తూ జీవనం కొనసా గిస్తున్నాడు. గ్రా మానికి చెందిన పులిగిళ్ల గంగయ్య అనే రైతు వ్యక్తిగత పనుల మీద వేరే గ్రామానికి వెళ్తూ తన గేదెలను మేపుకొని వస్తే కూలీ ఇస్తానని మ ణికొండ యాదయ్యకు గంగయ్య చెప్పాడు. గంగయ్య గేదెలను తో లుకొని యాదయ్య గ్రామ శివారులోని పొలం మేపుతుండగా అప్పటికే తెగిపడిన విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు యాదయ్యకు తాకడం అక్కడికక్కడే మృతిచెందాడు. యాదయ్య కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయుడి సస్పెన్షన్

మోతె, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మోతె మండలంలోని మామిళ్లగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులతో అసభ్యంగా ప్రవర్తిసస్తున్న ఉపాధ్యాయుడిని డీఈవో అశోక్ సస్పెండ్ చేశారు. డీఈవో అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉమెన్ డెవలప్‌మెంట్ చైల్డ్ వెల్ఫేర్, మహిళా శిశుసంక్షేమ ఆధ్వర్యంలో మహిళల రక్షణపై మామిళ్లగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 8వ తేదీన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గణిత ఉపాధ్యాయుడు సీహెచ్.శ్రీనివాసరెడ్డి తమతో కొన్ని నెలలుగా అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని తొమ్మిది, పదో తరగతి చదువుతున్న ఐదుగురు విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు ఈ కార్యక్రమానికి హాజరైన అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయుడిపై హెచ్‌ఎం రామనర్సయ్యకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని అధికారులకు తెలిపారు. ఈ అంశాన్ని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ దృష్టికి తీసుకువెళ్లారు. విచారణ నిర్వహించాలని డీఈవో అశోక్‌ను కలెక్టర్ ఆదేశించారు. సదరు ఉపాధ్యాయుడు సీహెచ్.శ్రీనివాస్‌రెడ్డి అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని డీఈవో విచారణలో తేలడంతో, ఈ నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఉపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డిని డీఈవో సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

లైసెన్స్ లేకుండా విక్రయిస్తున్న ఔషధాలు సీజ్



అధికారులు సీజ్ చేసిన ఔషధాలు

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండల పరిధిలోని దేశ్‌ముఖి గ్రామంలోని మెడికల్ దుకాణంలో లైసెన్స్ లేకుండా విక్రయిస్తున్న 31 రకాల నిషేదిత ఔషధాలను జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అశ్విన్‌కుమార్ మంగళవారం సీజ్ చేశారు. దేశ్‌ముఖిలోని ఆకుల గోపీనాథ్‌కు చెందిన లైసెన్స్ లేని ప్రాంగణంలో నిల్వ చేసిన 31 రకాల ఔషధాలను సీజ్ చేసి, సదరు వ్యక్తిపై డ్రగ్స్ అండ్ కాస్మటిక్స్ యాక్ట్ 1940 ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సీజ్ చేసిన మందులను చౌటుప్పల్ జెఎఫ్‌సీఎం కోర్టుకు అప్పగించినట్లు తెలిపారు. సుమారు రూ. 40వేల విలువైన మందులను సీజ్ చేసినట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

వలిగొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని లారీలో తరలించడానికి సిద్ధం చేస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని రెడ్లరేపాక గ్రామానిక చెందిన పంతాంగి రాజు, వృత్తిరీత్యా వ్యాపారస్తుడు ఆ గ్రామపరిధిలో శ్రీ వీరాంజనేయ బిన్ని రైస్ మిల్లును నిర్వహిస్తున్నాడు. తక్కువ ధరకు పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తునట్లు విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించగా, ప్లాస్టిక్ బస్తాల్లో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. సుమారుగా 240 బస్తాలను లారీలో లోడ్ చేస్తుండగా పట్టుకున్నారు. కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఆలేరు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరులో సోమవారం అర్ధరాత్రి జరిగింది. ఎస్‌ఐ రజినికర్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా నడికుడి మండలం పులిగిల్ల గ్రామానికి చెందిన టిట రామకృష్ణ(26) హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో నివాసముంటూ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం హైదరాబాద్ నుంచి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా ఆలేరు బైపాస్ మార్గంలో ఉన్న మెడిస్ హోటల్ వద్దకు రాగానే డివైడర్‌ను ఢీ కొనడంతో వాహనం పల్టీ కొట్టింది. ప్రమాదంతో రామకృష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. రామకృష్ణ అవివాహితుడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : డీఎంహెచ్‌వో



పల్లె దవాఖానాలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

చింతపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్య సిబ్బంది వీధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పోలేపల్లి రాంనగర్‌లోని పల్లె దవాఖానను మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో కేస. రవి, వైద్యాధికారి వంశీకృష్ణ పాల్గొన్నారు.

కరాటే పోటీల విజేతలకు సన్మానం



విజేతలకు షీల్డ్, సర్టిఫికెట్లు అందజేస్తున్న స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు

దేవరకొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా అకాడమి హైటెట్ స్కూల్ గ్రౌండ్స్‌లో ఈనెల 10న నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో దేవరకొండ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో మంగళవారం విజేతలకు అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ షీల్డ్‌లు, సర్టిఫికెట్లు, ప్రశంసాపత్రాలు అందజేసి మాట్లాడారు. అండర్-14 విభాగంలో సాయి, ప్రశాంత్ గోల్డ్‌మెడల్ సాధించారు. అండర్-17 విభాగంలో కిట్టు, రాజు తృతీయ స్థానంలో సిల్వర్ మెడల్ సాధించినట్లు ఎన్‌వీటీ తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు కృష్ణ కిశోర్, జగదీశ్వర్, జగన్, సురేష్ పాల్గొన్నారు.

16న చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలి

మిర్యాలగూడ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈనెల 16న నిర్వహించనున్న చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వగిడి జీడయ్య యాదవ్ కోరారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య పిలుపు మేరకు చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సతీష్, నాగేశ్వరరావు, సైదయ్య, మహేష్, వెంకన్న పాల్గొన్నారు.

విద్యతోనే ప్రగతి : జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి

మునుగోడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సమాజంలో విద్యతోనే ప్రగతి సాధ్యమని జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. మునుగోడు హైస్కూల్‌లో మంగళవారం 10వతరగతి విద్యార్థులకు ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల గ్రంథాలయ పుస్తకాలను అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. అంతకు ముందు తరగతి గదులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్‌భాస్కర్, హెచ్‌ఎం రవీందర్ పాల్గొన్నారు.

ధర్మానికి ఆపద కలిగినా మాట్లాడటం లేదు

- చెర్వుగట్టును దర్శించుకున్న మహిళా అఘోరా



చెర్వుగట్టు ఆలయంలోనికి వస్తున్న మహిళా అఘోరా

నార్కట్‌పల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గుళ్ల ధ్వంసమై సనాతన ధర్మానికి ఆపద కలిగినా ఎవరూ మాట్లాడటం లేదని మహిళా అఘోరా అన్నారు. మంగళవారం చెర్వుగట్టులోని పార్వతీ జడల రామలింగేశ్వర స్వామిని మహిళా అఘోరా దర్శించుకున్నారు. సొంత కారులో స్వయంగా డ్రైవింగ్ చేసుకుంటూ వచ్చిన అఘోరా తొలుత ఘాట్‌రోడ్ ద్వారా గుట్టపైకి చేరుకుని ఈవో కార్యాలయం వద్ద వాహనాన్ని నిలిపారు. వాహనంలో ఉన్నవరకు ఆచార సంప్రదాయంగా వివస్త్రగానే ఉన్న అఘోరా గర్భగుడిలోని మూలవిరాట్టును దర్శించుకునేందుకు వెళ్తూ కాషాయ వస్త్రాన్ని ధరించారు. మోకాళ్లపై మోకరిల్లి గర్భాలయంలోని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం గుట్ట కింద పార్వతీమాత అమ్మవారిని దర్శించుకున్నారు. ఇటీవల సోషల్ మీడియాలో ఆమె ఇంట ర్వ్యూలు, ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించిన ఫొటోలు, వీడియోలో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం కావడంతో ఆమెను చూసేందుకు భక్తులు ఎగబడ్డారు. కొందరైతే అఘోరా పాదాలకు మొక్కేందుకు ప్రయత్నించారు. కాగా మీడియాతో ఆమె మాట్లాడుతూ గో హత్యలు ఆపాలని, మహిళలపై అత్యాచారాలను అరికట్టాలని తాను ఎంత మొత్తుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. శంషాబాద్‌కు వెళ్తున్నట్లు మాత్రం చెప్పారు.

లక్ష్యం వైపు 'పది'లంగా..

» పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు » చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి » ప్రతి విద్యార్థికీ వారాంతపు, మాస పరీక్షలు



పీటీనగర్ జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

"పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధన దిశగా విద్యార్థులు ముందుకెళ్తున్నారు. విద్యార్థులు ఎలాంటి జంకూ లేకుండా పరీక్షలు రాసేలా సిద్ధం చేసేందుకు లక్ష్య సాధనలో నిమగ్నమయ్యారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యాశాఖ ఇప్పటి నుంచే చర్యలు తీసుకుంటుంది. దీంతోఈ నెల 2 నుంచి జడ్పీ ఉన్నత పాఠశాలల్లోని ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. దీంతో మండలంలోని ఏడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కలిపి మొత్తం 370మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్నారు." - (ఆంధ్రజ్యోతి,చింతపల్లి)

పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విభిన్న పద్ధతుల్లో బోధిస్తున్నారు. ఉదయం, సాయంత్రం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిని బృందాలుగా విభజించి ప్రతిభ కలిగిన వారితో సబ్జెక్టులపై చర్చిస్తున్నారు. వెనుక బడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకొని వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం పేర్కొన్న ప్రకారం.. సిలబస్ పూర్తిచేసి జనవరి నుంచి పునశ్చరణ(రివిజన్) తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతి విద్యార్థికీ వారాంతపు, మాస పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థి ప్రగతి ఆధారంగా బోధనలో మార్పులు చేస్తున్నారు. పరీక్షలు రాసే సమయంలో ఆత్మ స్థైర్యం పెంపొందించే అంశాలపై విద్యార్థులకు ప్రత్యేక బోధన, లక్ష్యసాధనకు కృషిచేస్తున్నారు. మండలంలో గత విద్యా సంవత్సరం చింతపల్లితో పాటు వెంకటేశ్వరనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించాయి. ఈ విద్యా సంవత్సరంలో అన్ని ఉన్నత పాఠశాలల్లో పది పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించాలని కృషి చేస్తున్నారు.

ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు



ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకుంటే ఉత్తమ ఫలితాలు సులువుగా సాధించవచ్చు. ఉపాధ్యాయుల సూచనలతో కష్టపడి చదువుతున్నాం. వివిధ అంశాలపై చర్చించుకుంటున్నాం. అన్ని సబ్జెక్టుల్లో మార్కులు ఎక్కువ సాధించడానికి కృషి చేస్తున్నాం.

- ఆర్. శ్రీచందన సాయి, పదో తరగతి విద్యార్థిని

చాలా ఉపయోగకరంగా ఉంది



గ్రామీణ ప్రాంతాల్లో ట్యూషన్‌లు చెప్పించుకునే అవకాశాలు లేవు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణ చాలా ఉపయోగకరంగా ఉన్నాయి. పాఠ్యాంశాల్లో సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు పరీక్షలకు మానసికంగా సిద్ధమయ్యేందుకు అవగాహన కలుగుతుంది.

- ఎల్. మానస, పదో తరగతి విద్యార్థిని.

జిల్లాస్థాయిలో గుర్తింపు



గతేడాది పదో తరగతిలో పాఠశాలకు చెందిన విద్యార్థులు సురిగి సింధు(9.8), హర్షిత (9.8), నాగేశ్వరి (9.7) మార్కులు సాధించి జిల్లాస్థాయిలో గుర్తింపు తెచ్చేలా తీర్చిదిద్దుతున్నాం. ఇద్దరు విద్యార్థులు జనరల్ కేటగిరిలో బాసరలో ఐఐటీకి ఎంపికయ్యారు. టీచర్ రెహన పర్యవేక్షణలో ఎన్‌ఎస్‌సిలో పాల్గొని రాష్ట్రస్థాయిలో బహుమతులు అందుకున్నారు.

- కృష్ణవేణి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు, వీటీనగర్.

వన్య ప్రాణుల సంరక్షణ చట్టాలపై అవగాహన ఉండాలి

నాగార్జునసాగర్,నవంబరు12(ఆంధ్రజ్యోతి):అటవీ శాఖ అధికారులు, సిబ్బంది అందరూ వన్య ప్రాణుల సంరక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సెంటర్ ఫర్ వైల్డ్ లైఫ్ స్టడీస్ న్యాయవాది తిరుపతి అన్నారు. నాగార్జునసాగర్ అటవీ శాఖ డివిజన్ కార్యాలయంలో మంగళవారం నాగార్జునసాగర్ అటవీ శాఖ డివిజన్ పరిధిలో ఉన్న కంబాలపల్లి, దేవరకొండ, నాగార్జునసాగర్ రేంజ్‌ల్లో పనిచేస్తున్న అటవీశాఖ సిబ్బందికి సెంటర్ ఫర్ వైల్డ్ లైఫ్ స్టడీస్ (సీడబ్ల్యూఎస్) బెంగళూరు ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్ మెంట్, వైల్డ్ లైఫ్ మానిటరింగ్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు.

సవరణ చట్టం- 2023 ప్రకారం వైల్డ్ లైఫ్ కేసులను ఏ విధంగా చేధిం చాలో వివరించారు. 1972 వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ చట్టంలో 2023 చట్టం ప్రకారం కేసులు ఏ విధంగా కేసు నమోదు చేయాలో వివరించారు. ఇప్పటివరకు ఈ ఏ డాది 460 మంది సిబ్బందికి అవగాహన కల్పించినట్లు చెప్పారు. సాగర్‌లో 50 మందికి శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూఎస్ అధికారులు బెంజమిన్, బాపురెడ్డి, ఎఫ్‌డీవో సంగీత, మూడు రేంజ్‌ల రేంజర్లు, డిప్యూటీ రేంజర్లు, సెక్షన్ ఆఫీసర్లు, వాచర్లు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అటవీ శాఖ సిబ్బంది

మునుగోడు ఎస్‌ఐగా రవి

మునుగోడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మునుగోడు ఎస్‌ఐగా ఇరుగు రవి బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన ఎస్‌ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు వీఆర్‌కు బదిలీ అయినట్లు ఉన్నతాధికారులు మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేయనున్నారు.

నకిరేకల్ అభివృద్ధికి కృషి

నకిరేకల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజితా శ్రీనివాస్ అన్నారు. స్థానిక 13వ వార్డులో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను మంగళవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. ఎమ్మెల్యే వేముల వీరేశం ఎస్‌డీఎఫ్ నిధులతో పట్టణంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేయాలన్నారు.

ఫలించిన కార్యాచరణ

(5పేజీ తరువాయి)

సూచిస్తుండడం తో మిల్లుల వద్ద కాంటాలు వేగవంతమయ్యాయి.

కలెక్టర్ సుడిగాలి పర్యటన

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు అన్ని చర్యలు అమలులోకి తేవడంతో పాటు క్షేత్రస్థాయి పరిస్థితిని పరిశీలించేందుకు కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం జిల్లాలో సుడిగాలి పర్యటించారు. పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. హాలియా మార్కెట్‌యార్డులో ఉన్న ధాన్యం కేంద్రాన్ని, నిడమనూరు మండలంలోని ఉట్కూరు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీచేసి అక్కడ కాంటాలు, ధాన్యం పరిస్థితిని పరిశీలించారు.ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ధాన్యాన్ని కాంటాలు వేసి వెంటనే గోదాములకు తరలించాలని ఆదేశించారు. వచ్చేవారం నుంచి ధాన్యం రాక ఎక్కువగా ఉంటుందని, ఆ మేరకు వాహనాల సంఖ్య పెంచాలని ఆదేశించారు.

ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కొండమల్లేపల్లి, నవంబరు 12 (ఆంధ్ర జ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వ్యవహరిస్తే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ హెచ్చరించారు. పెండ్లిపాకల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చే ధాన్యంలో తేమ శాతం తక్కువగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే సంబంధిత మిల్లులకు తరలించాలన్నారు. ఆయన వెంట డీటీఎస్‌వో హనుమంతు శ్రీనివాస్‌గౌడ్, సీఈవో తిరుపతిరెడ్డి, ఏఈవో మాధురి ఉన్నారు.



కొండమల్లేపల్లి : కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

● గుర్రంపోడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర కుటుంబ సర్వేను ఎన్యుమరేటర్లు తప్పులు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించి ఎన్యూమరేటర్లకు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట తహసీల్దార్ కిరణ్‌కుమార్, సీపీవో వెంకటేశ్వర్లు, ఎంపీడీవో మంజుల ఉన్నారు.

పత్తి కొనుగోలు చేయాలని రైతుల రాస్తారోకో

మర్రిగూడ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి):పత్తి కొనుగోలుకు బయ్యర్లు నిరాకరించడంలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు రోడ్డుపై రాస్తారోకోకు దిగారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం యర్రగండ్లపల్లి గ్రామంలో జరిగింది. గ్రావపరిధిలోని లక్ష్మీనర్సింహ ఆగ్రో పత్తి మిల్లుకు రెండ్రోజులు సెలవులు ఉండడంతో మంగళవారం ఉదయం దాదాపు 200 మంది రైతులు 50 ట్రాక్టర్లు, 15 డీసీఎంలలో పత్తి విక్రయం కోసం సీసీఐ కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకవచ్చారు. అయితే పత్తి కొనుగోలు చేసే బయ్యర్లు ప్రతిరోజు 1200 క్వింటాళ్ల వరకే పత్తిని కొనుగోలు చేయాలని ఆదేశాలు వచ్చాయని చెప్పారు. దీంతో రైతులు పత్తి మిల్లు ఎదుట రోడ్డుపై మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకోతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. బయ్యర్లు రోజుకో కొత్త నిబంధనలు తీసుకొని పత్తి కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌ఐ రంగారెడ్డి రైతులతో మాట్లాడి న్యాయం చేస్తానని చెప్పడంతో ఆందోళన విరమించారు.



రోడ్డుపై రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

● చిట్యాలరూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను నిర్వహించే ఎన్యూమరేటర్లు గ్రామాల్లో సర్వేను ఉదయం సమయంలో చేపట్టాలని ఆర్‌డీఓ అశోక్‌రెడ్డి సూచించారు. వట్టిమర్తి సర్వేను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. నివాసంలోని కుటుంబ సభ్యుల వివరాలు సేకరించే తీరును, ఫారం నింపే విధానాన్ని పరిశీలించారు. ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించాలన్నారు.



ఉద్యోగులపై దాడికి నిరసన

తిరుమలగిరి(సాగర్), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని లగచర్ల వద్ద ఫార్మా కంపెనీ ఏర్పాటుకు సంబంధించి ప్రజా సేకరణ కోసం వచ్చిన వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో పాటు రెవెన్యూ ఉన్నతాధికారులపై కొందరు దాడికి పూనుకోవడాన్ని నిరసిస్తూ మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులపై ఇలాంటి చర్యలకు పాల్పడడం సరైందికాదన్నారు. ఘటనలు చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. రెవెన్యూ, ఇతర శాఖల ఉద్యోగులపై జరిగిన ఈ సంఘటనకు నిరసిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ నాగమణి, సీనియర్ అసిస్టెంట్ కృష్ణయ్య, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రం తాకట్టు : సీపీఎం

చిట్యాలరూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రంలో అధి కారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెడుతోందని సీపీఎం కమిటి సభ్యుడు తుమ్మల వీరారెడ్డి ఆరోపించారు. మండలంలోని గుండ్రాపల్లిలో మంగళ వారం నిర్వహించిన సీపీఎం మండల 8వ మహాసభలో ఆయన మాట్లాడారు. పార్టీ జెండాను సీనియర్ నాయకుడు బొంతల చంద్రారెడ్డి ఆవిష్కరించారు. సభకు ముఖ్యఅతిథిగా హాజరైన వీరారెడ్డి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారాన్ని చేపట్టిన కేసీఆర్ సీఎంగా ప్రజలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ఇష్టానుసారంగా వ్యవహరించడంతో ప్రజలకు దూరమైనారన్నారు. మహాసభలో కందాల ప్రమీల, బొంతల చంద్రారెడ్డి, జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి

దేవరకొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమర శీల పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. దేవరకొండలో మంగళవారం నిర్వహించిన సీపీఎం 8వ మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టినకుల గణన సర్వేలో ఒక ఎన్యూమరేటర్‌కు 108 ఇళ్లు ఇచ్చి నిర్ణీతకాలంలో సర్వే పూర్తి చేయాలని చెప్పడం సాధ్యంకాదన్నారు. క్షేత్రస్థాయిలో ఎన్యుమరేటర్ల సంఖ్య పెంచి ఒత్తిడి తగ్గించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికై సీపీఎం ప్రజలపక్షాన నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. డిండి, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయా లన్నారు. ఈ మహాసభలో పార్టీ జిల్లా కార్యదరివర్గ సభ్యులు నారి ఐలయ్య, నల్ల వెంక టయ్య, బిజిలి లింగయ్య, యాదగిరి, వెంకటేష్ పాల్గొన్నారు.

సమాచారం

18 లోగా పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించాలి

మిర్యాలగూడ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫీజు ఈ నెల 18 లోగా చెల్లించాలని ఎంఈవో లావూరి బాలు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రెగ్యులర్, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పరీక్ష ఫీజు సకాలంలో చెల్లించేలా ఆయా పాఠశాలల యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలన్నారు. రూ. 50 అపరాధ రుసుముతో డిసెంబరు 2వ వరకు, రూ. 200 అపరాధ రుసుముతో డిసెంబర్ 13 వరకు పరీక్ష ఫీజు చెల్లించే వెసులుబాటు ఉందని వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నార్కట్‌పల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నార్కట్‌పల్లి, నక్కలపల్లిలో గల 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కోసం బుధవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ చంద్రశేఖర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. నార్కట్‌పల్లి, బీ.వెల్లెంల, చెర్వుగట్టు, అక్కినపల్లి, నెమ్మాని, నక్కలపల్లి విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు తులసీ అమ్మవారి కల్యాణం

నల్లగొండ కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తులసీనగర్‌లో గ భక్తాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు ధాత్రి నారాయణ సమేత తులసీ అమ్మవారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కుశలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బహిరంగ వేలం రేపు

నల్లగొండ కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పానగల్లులోని ఛాయ సోమేశ్వర ఆలయంలో కొబ్బరికాయలు పూజా సామగ్రి, లడ్డు, పులిహోర, ప్రసాదాల విక్రయానికి హక్కు కల్పించే విషయంలో బహిరంగ వేలం ఈనెల 14న ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు దేవదాయశాఖ ఏసీ అన్నెపర్తి సులోచన, ఈవో ఆర్.బాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు రూ. 10 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. రెండేళ్ల కాల పరిమితి మాత్రమే పూజా సామగ్రి విక్రయించే హక్కు ఉంటుందని వివరించారు

జర్నీ కథా సంకలన పుస్తకావిష్కరణ రేపు

చిట్యాలరూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా ఈ నెల 14న చిట్యాల మండలం వట్టిమర్తి జడ్పీహెచ్‌ఎస్‌లో జర్నీ కథా సంకలన పుస్తకావిష్కరించనున్నట్లు పుస్తక సంపాదకులు పెరుమాళ్ల ఆనంద్, పొట్టబత్తుల రామకృష్ణ తెలిపారు. విద్యార్థులు విహార యాత్రకు వెళ్లి మధుర జ్ఞాపకాలను విశేషాలను కథలను రూపంలో రాసి అనుభవాలను పంచుకున్నారని, పుస్తకాన్ని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి ఆవిష్కరించనున్నారని చెప్పారు. సాహితీవేత్తలు మేరెడ్డి యాదగిరిరెడ్డి, డాక్టర్ తండు కృష్ణకౌండిన్య, డాక్టర్ సాగర్ల సత్తయ్య, డాక్టర్ ఉప్పల పద్మ, శీలం భద్రయ్య, చిత్రకారులు కూరెళ్ళ శ్రీనివాస్‌లు హాజరుకానున్నారని, కార్యక్రమానికి కవులు, రచయితలు హాజరై విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

108లో పైలట్ ఉద్యోగాలకు దరఖాస్తులు

నాగార్జునసాగర్,నవంబరు12(ఆంధ్రజ్యోతి): 108 వాహనాలకు పైలట్(డ్రైవర్) ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా 108 మేనేజర్ ఎల్లావుల మధు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ సెట్‌ను తీసుకొని ఈ నెల 14న జిల్లా కేంద్రంలో ఉన్న 108 కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఇంటర్వ్యూ హాజరు కావాలని కోరారు. 25 నుంచి 30 ఏండ్ల మధ్యన వయస్సు కలిగి ఉండి ఎల్‌ఎంవీ (బ్యాడ్జి) లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి వివరాలకు 91542 51994 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

17న మాదిగల ఆత్మీయ సమ్మేళనం

నల్లగొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్జీ కళాశాల మైదానంలో ఈ నెల 17న ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి మాదిగలు, ఉపకులాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘాల నాయకులు బొర్ర సుధాకర్ మాదిగ, కొండేటి మల్లయ్య, చింతలపాటి చిన్నరాములు తెలిపారు. నల్లగొండలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణ చేయకుండా కమిటీల పేరుతో కాలయాపన చేస్తుందని దుయబట్టారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఇరిగి శ్రీశైలం, బకరం శ్రీనివాస్, రాజన్న, మాచర్ల సైదులు, పెరిక ఉమామహేశ్వర్, కత్తుల తులసీదాస్, స్వామి, కొమ్ము శంకర్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ అందించాలి

వేములపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ వెంటనే అందించాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్త వెంకన్న డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడారు. పింఛన్ల సాధన కోసం ఈనెల 26న హైదరాబాద్‌లో మంద కృష్ణ మాదిగ చేపట్టిన మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశం లో సుధాకర్, హైమద్‌ఖాన్, చైతన్య, సైదులు, వెంకన్న పాల్గొన్నారు.